# సంస్కర్త

పి. శంకర్‌రావు

నేటికి హైందవ దేశంలో— ఎంతోమంది సంస్కర్తలు జన్మించేరు. ఎన్నో సాంఘిక కార్యాలు సంస్కరించేరు. ఐతే- నేటికింకా - కట్నాలు పుచ్చుకోవడం అనే దురాచారం——రద్దవకపోవడానికి కారణం? సంస్కర్తలు లేకనా? లేక యువకులు— ఈ కార్యక్రమానికి పూనుకోకపోవడమా?

ఇక చదవండి.

ప్రతీతు పరమపూజ్యుడు. పవిత్ర మూర్తి. అతనిఆత్మ హైందవ సంఘంలో విహారం చేస్తూంది. ఇప్పటి పురాణ గ్రంథాల్లోకూడ సంచరిస్తూన్నాది.

కాలం...... కాలంబట్టి మార్పు... యువకులారా! ఆకాలంలో-అప్పటికింకా హైందవ నాగరికత విజృంభించని కాలంలో-సతీసహగమనం-ఆమోదింపబడింది. కాలంలో...... దొర్లింది.. అప్పటికింకా పుష్పం వికసించలేదు. రసాస్వాదనా సమ్మిళితమైన పుష్పసౌరభాన్ని ఈ ప్రేమమూర్తి-త్యాగమూర్తి-అయిన రాజా రామ్మోహన్ రాయ్ చూరగొన్నాడు. విశ్వ వ్యాపిత ప్రయత్నంచేసి హిందూ సంఘానికి-వన్నె పెట్టేడు.

"యువకులారా! అప్పటితో అయిపోయిందా! నేడు - ఈ హిందూ సంఘానికి - తీరని విపత్తు సంభవించింది. దురాశాపీడితులైన మానవులు-హైందవత్వం-ప్రేమయొక్క నైర్మల్యం తెలియక కన్యాశుల్కాలను లాగుతున్నారు. దీనిని మాన్పడానికి బాధ్యత అంతా మీది. మీరు యువకులు. దీనిని నాశంచేయడానికి సమర్థులు."

అని ఆనాడు - కాలేజి లెక్చరర్ గారు యువకుల కోరికపై ఉపన్యసించేరు. సభ ముగిసింది. అందరూ యింటిత్రోవ పట్టేరు.

కుమార్ హృదయంలో చెప్పరాని ఆవేదన బయల్దేరింది... లెక్చరర్ మాటలే అతని హృదయ సీమల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. తన దేశసౌభాగ్యానికి - తను - ఎంతవరకు కారకుడు? తనకింకా పెళ్లి కాలేదు. తన పెళ్ళికి - ఈ వరకట్నం - నిశ్చయిస్తే తను ఎలా ప్రవర్తించాలి? అయితే-ఇప్పుడు చెప్పిన ఉపన్యాసాల ఫలితం ఏమిటి? రామ్మోహనరాయ్--- అప్పుడేంచేసేడు? జీవితానికి - తెగించాలి. సంఘానికి-భయపడకూడదు. తను సాంఘికంగా- అప్పుడే గొప్పవాడవుతాడు. ఇలా ఆలోచిస్తూ కుమార్ ఇల్లు చేరుకున్నాడు.

## 2

'కుమార్'

'నాన్నా'

నువ్వీ పెళ్ళికి ఒప్పుకోవాలి. అయిదువేల నూటపదహార్లు కట్నం. పిల్లకేమిట్లే........

'నాన్నగారూ! క్షమించండి. వారికిచూస్తే ఉన్న ఆదాయం తక్కువ. మనకి అయిదువేల నూటపదహార్లు కట్నం యిచ్చి, వారెలా బ్రతుకుతారండీ! ఈ వెధవకట్నాలువచ్చి... మన సంఘాన్ని నాశం చేస్తున్నాయి. నాన్నగారూ! ఇంతకన్న ఎక్కువ చెప్పలేను. నాకీ పెళ్ళి వద్దు........'

'ఓ హో హో! నువ్వేదో సంతోషంగా ఒప్పుకుంటావనుకున్నాను. వీల్లేదు. ఈ పెళ్ళి జరిగి తీరాలి.'

'నా కిష్టంలేదు' అంటూ కుమార్ వీధిలోకి వెళ్ళిపోయాడు...... దారిపొడుగునా ఒకటే ఆలోచన.........

'ఈ కన్యాశుల్కం మాన్పడానికి - నేనొక్కణ్ణి సమర్థుణ్ణా? ఏం? ఎంచేత కాకూడదు? రాజా రామ్మోహన్ రాయ్ - స్వప్రయత్నంవల్లేకదా!

పతీసహగమనం మాన్పేడు! ఇప్పుడు నేనుమాత్రం ...యెందుకు ప్రయత్నం చేయకూడదు...

ఆ మర్నాడు...కుమార్ ఇష్టం లేకపోయినా పెండ్లికూతుర్ని – చూడ్డానికి బయల్దేరాడు.

శ్యామల...పెండ్లికూతురు. తండ్రికి...చిన్న ఇల్లు...నాల్గు ఎకరాల పొలంమాత్రమే ఉంది. సంసార సముద్రంలో...తుఫానులకు జడుస్తూ... కెరటాలకు బెదురుస్తూ...వారి నౌకప్రయాణం చేస్తూంది. శ్యామలకి పద్నాలుగేళ్లు. వివాహం చెయ్యకపోతే ... సంఘం ... ఒప్పుకోదు...పెళ్ళికొడుకుకోసం ప్రయత్నంచేస్తే – మన కుమార్ దొరికాడు అయిదువేల నూటపదహార్లకి...! అంతకట్నం ఎలా ఇచ్చుకోడం...అనేది వారి బెంగ...

కుమార్, అతని తండ్రి ...పట్నం చేరుకున్నారు...పెళ్ళికూతుర్ని చూడడానికి. తాంబూలాలు పుచ్చుకున్నారు. మళ్ళీ, శ్యామల తండ్రి, కట్నం తగ్గించమని ప్రాధేయపడ్డాడు. కాని లాభం లేకపోయింది.

పెళ్ళి ఖాయమయింది. కట్నంకోసం శ్యామల తండ్రి...కాళ్ళరిగేలా తిరిగేడు. రెండువేలు అప్పు దొరికింది. ఇంకా నాల్గు వేలు కావాలి. ఎక్కడ్నుంచి వస్తాయ్?

అహోరాత్రాలు – అతని హృదయవీధుల్లో... శ్యామల......కట్నం......కుమార్......బాధ ...సంచరిస్తున్నారు. పెళ్ళింకా నెలరోజులుంది. నాల్గు ఎకరాల భూమి-అమ్మేశాడు...మిగతాది?...

3

శ్యామల కిప్పుడు ... పద్నాలుగేళ్ళు. థర్డుఫారంవరకు చదివి మానేసింది...ప్రతీ వ్యక్తిని ఆకర్షించే ముఖం...విశాలమైన నేత్రాలు...

ఇంట్లో కలతలు సులభంగా అర్థంచేసుకుంది. తనవల్ల...తన తల్లికీ – తండ్రికీ – చెప్పరానిబాధ! స్త్రీలను కన్న తలిదండ్రుల కందరికీ ఇటువంటి బాధ ఉంటుందేమో! అని అనుకుంటూవుండేది. తను కనుపిస్తే...తండ్రికి బాధ! తల్లిమాత్రం...పొంగి పొరలివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక శ్యామలదగ్గరే ఏడుస్తూ ఉండేది............

ఆనాడు అమావాస్య...కటిక చీకట్లు అనంత ప్రపంచంలో...ఆమూలాగ్రంగా వ్యాపిస్తున్నాయ్. శ్యామల హృదయం...బరువుగావుంది. ఆమె హృదయము ఆకాశంలో...ఉరుములూ...మెరుపులూ... ప్రళయగర్జనారావమైన అరుపులూ...బయల్దేరాయి. ఆమె తీవ్రంగా ఆలోచిస్తూంది. 'కుమార్...చదువుకొన్న యువకుడు...సంఘంలో మెలిగేవాడు... మమ్మల్ని విపత్తునుండి రక్షించలేడూ? పెళ్ళి చూపులకు వచ్చిన్నాడు...అతని ముఖం...విచారంగా ఉంది. దీనికి కారణం... నేను నచ్చలేదేమో? అయితే...పెళ్ళి ఖాయమని ఉత్తరం...ఎందుకు వచ్చింది? పోనీ...మా యింటిపరిస్థితులు తెలుపుతూ మాకు సాయం చేయమని...కుమార్ కి ఉత్తరంరాస్తే? అవును. అనుకుంటూ కలం కాగితం తీసి కుమార్ కి ఉత్తరం రాసింది.

4

ఆనాడు ఆదివారం. కుమార్ వీధిసావిట్లో మడత కుర్చీ మీద కూర్చున్నాడు. ఏమీతోచక 'Lives of Great - men' తీసేడు చదవటానికి, ముందర దాంట్లో- రాజా రామ్మోహనరాయ్...బాల గంగాధర్ తిలక్‌ల జీవితచరిత్రలు ప్రత్యక్షమయ్యాయి. అతని హృదయంలో...తిరిగి తుఫాను చెలరేగింది.

ఆనాడు...కార్చిచ్చు మంటల్లో చితిపేర్చి – భర్తతో సహితం భార్యని...దావాగ్నిలో చేర్చబోతుంటే – రామ్మోహనరాయ్ – ఆమెను వెనక్కులాగి...భగవద్గీతలో ఒక శ్లోకం చదివి – బోధచేసి సతీసహగమనం తప్పని – నచ్చచెప్పి-ఆమెను ఇంటికి తీసికెళ్లేడు. కాని...సంఘం? మరి నూరేండ్లవరకు అతని చర్యని ఆమోదించలేకపోయింది...

ఈనాడు... నేను, ఆ బీద కుటుంబీకులకు ఏలాటి సాయం... చెయ్యలేక పోయాను. సంఘానికి జడుస్తున్నా .........

ఇంతలో Post-man అతనికొక ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయాడు. అతడు దానిని విప్పి చదువుకున్నాడు. ఆ వుత్తరం...శ్యామల దగర్నుంచి... ఆమె తనకుటుంబ పరిస్థితులు తెలుపుతూ...కట్నం తగ్గించమని రాసింది.

అతని హృదయంలో ఆశ్చర్యం...ఆనందం విషాదం...ఒక్కసారి సంచరించేయి. అయితే - 'నాకర్తవ్యం' అనేది మరో పెద్దప్రశ్న. ఇంతకాలం నుంచి తను అనుకున్న అభిప్రాయాలు ఎలా కొనసాగడం? తండ్రితో చెప్తే లాభంలేదు. తనదగ్గర ధనంలేదు...తను ధనం ఇవ్వలేడు...కట్నం పుచ్చుకోగూడదు...ఆమెకి ఎలా సాయంచేస్తాను? ఈ ప్రపంచంలో ఉన్నందుకు...నాకు —— ఏలాటి స్వాతంత్ర్యంలేదా?

5

ఆ మర్నాడు...శ్యామలకి కుమార్‌దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. తను తండ్రిచాటువాడ్ననీ... తనకీ ఉత్తమ అభిప్రాయాలు వున్నాయనీ...కాని ఆచరణలో పెట్టడానికి...ధనం......స్వాతంత్ర్యం లేవనీ...దీనికి నేను క్షంతవ్యుణ్ణనీ రాశేడు......

శ్యామల ఆశాసౌధాలు నేలమట్టమయ్యాయి. ఆమె అంతరాత్మలో హాహాకారాలు...కార్చిచ్చు మంటలు...రేకెత్తాయి.

'శ్యా...మ...లా! నా...న్న...గారి...నీ...జెంగ...మూ...లా...న్న...పెద్ద...జబ్బు... చేసిందే...?'

ఆమె లేతహృదయం భగ్గున మండింది. తల్లి మాటలు ఆమెకి అగ్నికణాలయ్యేయి. తన హృదయానికి శాంతిలేదు...తన తండ్రి అంతరాత్మకి... శావులేదు...దీనికి కారణం తను. అయితే...ప్రతీకారం? తన జీవితాంతం...అయితే తనుగురించి బాధపడే వ్యక్తులెవరు?

ఆమర్నాడు................

ఆమె అంతరాత్మ...భౌతికదేహం...పవిత్రమైన కృష్ణానదిలో కలుసుకున్నాయి. ఈవార్త కుమార్‌కు తెలిసింది. వెంటనే వాళ్ళవూరు వెళ్లేడు. కాని అక్కడ తలిదండ్రులుకూడా లేరు......

శూన్య హృదయంతో...కృష్ణా ప్రవంతివేపు వెళ్లేడు. అలలు అరుస్తున్నాయి. అరుపులో... శ్యామల కంఠం వినబడుతోంది ... కుమార్ హృదయం...భావశూన్యమయింది...తనకింక రామ్మోహనరాయ్ లేడు...అతడు ఎలా సంస్కర్త అయేడో తెలుసుకున్నాడు............

కుమార్ తండ్రి మళ్లీ అతనిని పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చేడు. కాని 'పెళ్ళి' అనేసరికి అతని హృదయంలో...శ్యామల...కట్నం...సంచరించేరు. అతని ఆత్మలో ఉద్ఘోష బయల్దేరింది. శ్యా...మ...లే...నీ...భా...ర్య...!

మరి కొద్దిరోజుల్లో...కుమార్ ఒక గొప్ప సంఘసంస్కర్త...అతడు నివసించే గ్రామాల్లో ప్రజలు కట్నాలు పుచ్చుకోకూడదు.........

ఆనాటి సాయింత్రం కృష్ణవేపు నడిచేడు... కృష్ణాప్రవంతి...నిర్మలంగా వుంది...దానితోబాటు ...శ్యామల ఆత్మకూడ నిర్మలంగా వుంది...నీటి లోంచి శ్యామల...కంఠం...మాట్లాడుతోంది... 'కుమార్'...నీవూ! ధన్యుడవే!'

ఆ చెట్టుమీద ఉన్న కోకిల......నవ్వుతూ వెళ్ళిపోయింది!